# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన 3


సంపుటి : 01 | సంచిక : 135 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 11 ఏప్రిల్ 2026 | పేజీలు : 4




# ప్రజా భద్రతే లక్ష్యంగా సాగాలి

- 13 నుంచి 18 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలు
- 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక చర్యలు
- ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమం అమలుపై కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు చేపట్టనున్న అరైవ్ - అలైవ్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృత స్థాయిలో నిర్వహించాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రోడ్ భద్రత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు వీలుగా చేపట్టే అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. 13న అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేలా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక పక్కాగా ఉండాలన్నారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాలు పోలీస్, రవాణా, వైద్యారోగ్య, విద్యా, మిగతా అన్ని శాఖలు సమన్వయంతో షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో, అలాగే మున్సిపాలిటీల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏసీపీ పండరి చేతన్ నితిన్, ఆర్డీఓ వెంకన్న, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, విద్యా శాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఏ సభ్యులు అభి గౌడ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# మక్క రైతులకు మద్దతు ధర

- కంచనపల్లిలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం

3 లో




# హనుమకొండలో యోగ శిబిరం

- **మెగా ఆయుష్ ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన**



**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పరిపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హనుమకొండ జిల్లాలో ఉచిత యోగ శిబిరం మరియు యోగా అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమాన్ని ఆయుష్ డిపార్ట్మెంట్ హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్ సమన్వయంతో, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డా. ప్రమీల దేవి ఆదేశాల మేరకు నిర్వహించారు. యోగ శిబిరంలో వివిధ వయస్సుల ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిపుణుల పర్యవేక్షణలో ప్రాణాయామం, సూక్ష్మ వ్యాయామాలు, వివిధ యోగాసనాలు ప్రదర్శించడంతో పాటు వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీ చాహత్ బాజ్ పై హాజరై యోగ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగం కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత, ఒత్తిడి తగ్గింపు, రోగనిరోధక శక్తి పెంపుకు దోహదపడే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్న వారికి ప్రేరణగా నిలిచారు. ఇదిలా ఉండగా, హోమియోపతి పితామహుడు శామ్యూల్ Hahnemann జయంతిని పురస్కరించుకుని వడ్డేపల్లిలోని ప్రణయ్ (భాస్కర్) పార్క్‌లో ఉచిత హోమియో, ఆయుర్వేద, యునాని మెగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రీ దాస్యం అభినయ భాస్కర్ ప్రారంభించారు. ఆరోగ్య శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తూ ఆయుష్ వైద్య విధానాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అప్పయ్య గారు మాట్లాడుతూ సంప్రదాయ వైద్య విధానాలు శరీరానికి హానికరం కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని చెప్పారు. జీవనశైలి సంబంధిత వ్యాధులను నియంత్రించడంలో ఆయుష్ వైద్యం కీలకమని పేర్కొన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి, వారి సమస్యలకు అనుగుణంగా హోమియో, ఆయుర్వేద, యునాని మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 453 మంది రోగులు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందగా, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా ఇన్చార్జ్ డాక్టర్ ఎస్. మహేంద్ర కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ భాను కుమార్, వైద్యులు డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ రజిత, డాక్టర్ శోభ, డాక్టర్ కిరణ్ కుమార్, ఫార్మసిస్టులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తానికి, యోగ శిబిరం మరియు మెగా ఆరోగ్య శిబిరం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెరగడంతో పాటు, ఆయుష్ వైద్య విధానాలపై విశ్వాసం మరింత బలపడినట్లు నిర్వాహకులు తెలిపారు.




# రక్తదానం ప్రాణదానంతో సమానం

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**జనగామ, మన చౌరాస్తా :** రక్తదానం ప్రాణదానంతో సమానమని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా సామజిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యం తో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగం గా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ఇది ఎంతో నిస్వార్థమైన, గొప్ప మానవీయ సేవ అని, ఆరోగ్యవంతులైన వ్యక్తులు చేసే రక్తదానం ప్రమాదాల్లో, శస్త్రచికిత్సల్లో, తీవ్రమైన వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారి ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండెపోటు ప్రమాదం తగ్గుతుందని, శరీరంలో ఐరన్ స్థాయిలు అదుపులో ఉంటాయన్నారు. ఈ రక్త దాన శిబిరంలో వివిధ శాఖల అధికారులు, వారి సిబ్బంది మొత్తం 62 మంది తమ రక్తాన్ని దానం చేశారు. ఈ శిబిరాన్ని మెడికల్ అధికారులు, వారి టెక్నీషియన్స్ సజావుగా నిర్వహించి రక్తం దానం చేసిన వారికి పండ్లు, జ్యూస్ లను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మల్లిఖార్జున్ రావు, డీసీహెచ్ఎస్ నరేందర్ శర్మ, మెడికల్ అధికారులు అన్వర్, దివ్య పాల్గొన్నారు.

# బహుజన నాయకుడు ప్రభాకర్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండల్ ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద చెప్పాలా ప్రభాకర్ అన్న జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది . తెలంగాణ ఉద్యమ నాయకుడు, బహుజన సిద్ధాంతకర్త, దళిత బహుజనుల స్ఫూర్తి ప్రదాత చెప్యా ల ప్రభాకర్ అన్న జయంతి కార్యక్రమం రాజకీయ పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, దళిత బహుజన మిత్రులు అంబేద్కర్ వాదులు తెలంగాణ ఉద్యమ నాయకులు అన్ని కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం ముల్కనూర్ సుధాకర్ హాస్పిటల్ లో పేషంట్లకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసి హుస్నాబాద్ నియోజకవర్గ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి. ముల్కనూరు నర్సింగ్ హోమ్ డాక్టర్ సుధాకర్, మాజీ జడ్పిటిసి వంగ రవీందర్, జేఏసీ చైర్మన్ భీమదేరుపల్లి డి. సారయ్య, ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, దారణ శ్రీనివాస్, అప్పని భిక్షపతి, డాక్టర్ ఎద్దులాపురం తిరుపతి, మాడుగుల కొమురయ్య, చెప్పాలా ప్రకాష్, చెప్పాలా మాయావతి, మారుపాటి మహేందర్ రెడ్డి, గజ్జల సురేష్, రేణిగుంట్ల బిక్షపతి, మాడుగుల అశోక్, మాడుగుల ఈశ్వరయ్య, తాళ్లపల్లి మధుకర్, కండే చక్రపాణి, పొన్నాల వినోద్, మాడుగుల నరేందర్, తూముల స్వామి ఎదులాపురం రాజమౌళి, రామ్ కుమార్ పాల్గొన్నారు.





# హిందూ సమ్మేళన నిర్వహణ కమిటీ ఎన్నిక

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళన కార్యక్రమం నిడిగొండ కేంద్రంగా నిర్వహించడానికి నిర్వాహక కమిటిని వివిధ గ్రామాల నుండి 18 మంది సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మిల్కూరి రేణుక (నిడిగొండ), ప్రధాన కార్యదర్శిగా గైని శ్రీనివాస్ (బాణాజీపేట), కోశాధికారిగా కాట మహేశ్ (కుర్మగూడెం), ప్రచార కార్యదర్శిగా జ్యోతి కిశోర్ (నిడిగొండ), సోషల్ మీడియా కన్వీనర్లుగా గోపగాని శ్రీకాంత్, గొపగాని సిద్దార్థ్ (నిడిగొండ), ఉపాధ్యక్షులుగా ఎలపాటి రాంరెడ్డి (నిడిగొండ), గుజ్జుల కొంరాజి (శ్రీమన్నారాయణ పురం), మరాఠి జంపన్న (రఘునాథ్ పల్లి), గాజులపాటి అఖిల్ (ఫతేషాపూర్), సంయుక్త కార్యదర్శులుగా చేవేల్లి వెంకన్న (నిడిగొండ), పులి రామాంజనేయులు (గబ్బేట), కోనేటి శ్రీనివాస్ (బానాజీపేట), కొండ అశోక్ (ఇబ్రహింపూర్) సభ్యులుగా పెండల ప్రశాంత్, పెండల పల్లవి, కొంగరి నర్సింగరావు, బొంగు శ్రీధర్ (నిడిగొండ), దిగ్గోజు సాంబాచారి (ఎల్లారెడ్డి గూడెం) ను ఎన్నుకున్నట్టు తెలిపారు.




# జీజేసీలో ఎంఎన్ఎస్ ఫార్మా ఇంటర్వ్యూలు

**ఇంటర్ విద్యార్థులకు ఇది అద్భుత అవకాశం**

**జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి**

**జనగామ, మన చౌరాస్తా :** ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హైదరాబాద్ ఎంఎంఎస్ ఫార్మా ప్రతినిధి తువ్వపాటి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో మరియు కళాశాల ప్రిన్సిపల్ నాముని పావని కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల 20 మంది ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి ఫార్మా కంపెనీ ప్రతినిధి ఎగ్జామ్ కండక్ట్ చేసి, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసిన తరువాత ఇంటర్వ్యూ నిర్వహించడం జరిగింది. దీనిలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి త్వరలోనే వారి ప్రతిభను బట్టి జాబ్ కాల్ లెటర్ అందిస్తామని శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇంటర్మీడియట్ అయిపోగానే జాబ్ అవకాశం రావడం చాలా అద్భుత అవకాశం అని.. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పావని కుమారి సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ వై శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరిపెల్ల రవి ప్రసాద్ మరియు లెక్చరర్స్ డాక్టర్ వరుదుని, గోక గణేష్, బిల్లా శంకర్, కాపర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, ఆఫీస్ ఇంచార్జి విష్ణు పాల్గొన్నారు.



# టూరిజం ఉద్యోగుల వయో పరిమితి పెంచాలి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వయో పరిమితిని 61 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ సంఘం నాయకులు ఈరోజు టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ టూరిజం శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సేవలను దృష్టిలో ఉంచుకొని వయో పరిమితిని పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇటీవల వేతనాలు పెంచినందుకు టూరిజం మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, కాంట్రాక్ట్ కార్మికుల గ్రాడ్యూటీ మొత్తాన్ని కూడా పెంచాలని వారు కోరారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజయ్య, ఉడత రమేష్, రాజశేఖర్, బల్వీర్, తిరుపతి, భద్రన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్లపై వ్యాపారం నిర్వహించొద్దు

### చేర్యాల మున్సిపాలిటీలో తీర్మాణం

చేర్యాల, మన చౌరాస్తా : చేర్యాల మున్సిపాలిటీలో శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్పర్సన్ ముస్త్యాల అరుణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రహదారి పుట్ పాత్ ల పై వ్యాపారం నిర్వహించడం వల్ల చేర్యాల పట్టణ ప్రజలు మరియు చేర్యాల కు వచ్చే ఇతర గ్రామాల ప్రజలు యాక్సిడెంట్లకు గురి కావడం జరుగుతుంది. ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకొని పాలకవర్గం ప్రత్యేక తీర్మానం ద్వారా పుట్ పాత్ ల పై వ్యాపారం నిర్వహిస్తున్న వాటిని వెంటనే తొలగించాలని ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగింది . ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న ఆర్టిసన్ ఉద్యోగుల సమ్మె

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఆర్టిసన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్న ఆర్టిసన్ కార్మికులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమను విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిసన్ ఉద్యోగులను కన్వర్షన్ చేసి, సంస్థలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలు తమకూ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తక్కువ జీతాలతో కష్టపడుతూ వెట్టి చాకిరీ చేస్తున్నామని కార్మికులు వాపోయారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం తక్షణమే స్పందించి ఆర్టిసన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు తమ పూర్తి మద్దతు కొనసాగుతుందని తెలిపారు.





# వైభవంగా బీరప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన

**రఘునాథపల్లి, వెలుగు :** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోడూర్ గ్రామంలో శ్రీ బీరప్పకామరాతి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు నాలుగు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం కాగా శుక్రవారం విగ్రహాల నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా మంగళవాయిద్యాల మధ్య విగ్రహాల ఊరేగించారు. ఇక శనివారం (ఏప్రిల్ 11) ఉదయం హోమం, జలాభిషేకం, పుష్పాభిషేకం, ధాన్యాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం (ఏప్రిల్ 12)శ్రవణ నక్షత్రయుక్త శుభలగ్నమందు ఉదయం 9:30 గంటలకు అక్కమ్మహంకాళి, బీరప్పకామరాతి, బుగ్గ పోచమ్మల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనుంది. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కురుమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.




## సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సమీక్ష

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలో సర్పంచ్ ఎన్నికలపై సమీక్ష టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జె తొర్రురు, మేకల తండా, కొండాపురం గ్రామాలలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి చెందిన అంశంపై స్థానిక నేతలతో సమాలోచనలు జరిపారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ఫలితాలపై విశ్లేషణ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఓటమి కారణాలను లోతుగా విశ్లేషించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలాన్ని పెంపొందించడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలతో మరింత దగ్గరగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు.



## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువచ్చిన మక్కలను పరిశీలించి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యాపారస్తులు కుమ్మక్కై తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల మక్క రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అందువల్ల ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి మక్కలు కొనుగోలు చేయాలని మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మొక్కజొన్నలో తేమ 14శాతం మించకుండా మక్కలను ఆరబెట్టి కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలని సూచించారు. నిర్వాహకులు కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు త్రాగు నీరు, టెంట్, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, స్థానిక సర్పంచ్ అబ్రహం, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే కమిటీని ఏర్పాటు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని మరియు ప్రభుత్వం తరపున అధికారికంగా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ నాయకులు శుక్రవారం జనగామ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మినరసింహ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకుడు మంగళంపల్లి రాజునేత మాట్లాడుతూ, సమాజ సంస్కర్త, బహుజన వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పేలా ప్రతి ఏటా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీసీ జేఏసీ నాయకులు మంగళంపల్లి రాజునేత, కొత్తపల్లి అభినాష్ నంద, కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# దసరాకు రిలీజ్ చేసేలా ..ఫౌజీ షూటింగ్ స్పీడ్

ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**